# సమస్యలతో సహజీవనం

- జగనన్న కాలనీలపై నిర్లక్ష్యం
- వేధిస్తున్న మౌలిక సదుపాయాలు
- కాలనీల్లో తాగునీటి ఎద్దడి
- ప్రధాన, అంతర్గత రహదారులు లేక సతమతం
- ఆందోళన చెందుతున్న కాలనీవాసులు




కోర్టు వెనుక ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి, కంపచెట్లతో నిండిపోయిన జగనన్న కాలనీ

**కోవెలకుంట్ల:** పట్టణ శివారులో ఏర్పాటు చేసిన మూడు జగనన్న కాలనీల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేస్తుండడం ప్రజలకు శాపంగా మారింది. గత ప్రభుత్వం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీతోపాటు మండలంలోని సొదరదిన్నె, కంపమల్ల గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 2020లో మూడు కాలనీలు ఏర్పాటు చేసింది. కోర్టు వెనుక ప్రభుత్వ స్థలంలో 396 మందికి, ప్రైవేట్ భూమిని కొనుగోలు చేసి 471 మందికి, ఎస్సార్బీసీలో 240 మందికి కలిపి మూడు కాలనీల్లో 1,157 మందికి ఇంటి స్థలంతోపాటు పక్కాగృహాలు మంజూరు చేశారు. ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని సుమారు 120 కుటుంబాలు ఆయా కాలనీల్లో నివాసం ఉంటున్నారు. కాలనీలకు ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, తదితర వసతులు కల్పించకపోవడంతో ప్రజలు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు.

### తాగునీరు కరువు

ఇంటి నిర్మాణానికి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 1.80 లక్షలు, ఉచిత ఇసుక, రాయితీపై కడ్డీలు, సిమెంట్, కిటికీలు తదితర ఇంటి నిర్మాణ సామగ్రితో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. కోవెలకుంట్ల–నంద్యాల ఆర్అండ్‌బీ రహదారి పక్కన ఎస్సార్బీసీ కార్యాలయం వద్ద నుంచి ఒక కాలనీ, పట్టణ శివారులోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపం నుంచి మిగిలిన రెండు కాలనీల్లోకి వెళ్లాల్సి ఉంది. ఆయా కాలనీలకు వెళ్లేందుకు ప్రధాన రహదారులు ఏర్పాటు చేయకపోవడంతో పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ చేసి రహదారి బురదమయంగా మారి రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ ఏర్పాటు దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో కాలనీలు ముళ్లపొదలతో నిండిపోయాయి. శివారు ప్రాంతం కావడంతో విష సర్పాలు సంచరిస్తుండటంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కోర్టు వెనుక ఉన్న కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి రౌండ్ లెవల్ ట్యాంకులు నిర్మించి కొళాయిల సౌకర్యం కల్పించారు. కొన్ని నెలల నుంచి నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. కుందూనదికి వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. పట్టణంలోకి వచ్చి మినరల్ వాటర్‌ప్లాంట్ల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. వేసవి కావడంతో నీటి ఎద్దడి నెలకొంది.

### వసతులు లేకున్నా నివాసం

కోవెలకుంట్ల పట్టణంలో రెండు గదులు ఉన్న చిన్నపాటి ఇంటికి రూ. 2,500 నుంచి రూ. 3 వేలు బాడుగ చెల్లించాల్సి ఉంది. నలుగురు, ఐదుగురు సభ్యులున్న కుటుంబం రూ. 4 వేల నుంచి రూ. 5 వేలు బాడుగ చెల్లిస్తే తప్ప ఇల్లు దొరకని పరిస్థితి. వ్యవసాయ, ఉపాధి, ఇతర కూలీ పనులకు వెళ్లే కుటుంబాలు అంత మొత్తం కట్టలేక జగనన్న కాలనీల్లో నిర్మించుకున్న సొంత ఇళ్లలో నివాసం ఉంటున్నారు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేకపోయినా విధిలేని పరిస్థితుల్లో అక్కడే నివాసం ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా మారిన రౌండ్ లెవల్ ట్యాంకు

### రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



కోర్టు వెనుక ఉన్న జగనన్న కాలనీకి వెళ్లేందుకు ప్రధాన రహదారి లేదు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కిమీ దూరంలో జగన్న కాలనీ ఉంది. ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు, డ్రెయినేజీ వసతి లేక కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు కల్పించి ఆదుకోవాలి.

–కౌసర్, సొదరదిన్నె, కోవెలకుంట్ల

### తాగునీటికి కటకట



జగనన్న కాలనీల్లో నివాసం ఉండే ప్రజల సౌకర్యార్థం మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. మూడు నాలుగు నెలల నుంచి కొళాయిల ద్వారా నీరు రావడం లేదు. నీరు రాకపోవడంతో కాలనీల్లో ఉంటున్న ప్రజలు తాగునీరు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు నీటి వసతి లేక ట్యాంకర్ల ద్వారా తరలించుకోవాల్సి వస్తోంది. అధికారులు మంచినీటి పథకానికి మరమ్మతులు చేపట్టాలి.

–డీసీ ఉసేన్, కోవెలకుంట్ల

## క్లుప్తంగా

### ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్

**ప్యాపిలి:** రసాయనిక ఎరువుల ఉత్పత్తుల కంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే ఉత్పత్తులే ఆరోగ్యకరమైనవని తహసీల్దార్ భారతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. మెట్టుపల్లి, బావిపల్లి యూనిట్లలోని రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయలు, ఆహార ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యవసాయ సిబ్బంది చిన్న పుల్లయ్య, రాజేశ్వరి, సంతోష్, అభిషేక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



నాగేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** నందిపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత నాగేశ్వరరెడ్డిని సోమవారం జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. పది రోజుల క్రితం పేగు సంబంధిత వ్యాధితో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకుని ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న జెడ్పీచైర్మన్ ఆయన్ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్వరరెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, కామిని తిమ్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

### చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

**బేతంచెర్ల:** అంగన్‌వాడీల్లోని చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ, శకుంతల అన్నారు. సోమవారం పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూల్‌లో కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ–2 అబ్రహం ప్రారంభించారు. ×పోషణ భీ, పడాయి భీ₹ అనే కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. చిన్నారుల పోషణ, వికాసానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

### గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**ప్యాపిలి:** గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బూరుగల, సీతమ్మతండా, చంద్రపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వలసలు నివారించి ఉపాధి పనులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



బార్ అసోసియేషన్ నూతన కమిటీ

**కోవెలకుంట్ల:** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి అధ్యక్షుడిగా ఎం. ఓబులేసు, ఉపాధ్యక్షుడిగా ధారా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె. రమేష్, ఉప ప్రధాన కార్యదర్శిగా వి.సుధాకర్, కోశాధికారిగా ఎం. చంద్రుడును కోవెలకుంట్ల న్యాయవాద సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి 2026 మార్చి నెలాఖరు వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సీనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

## లైంగిక నేరాలకు పాల్పడితే యావజ్జీవ శిక్ష



మాట్లాడుతున్న జడ్జి

**ప్యాపిలి:** బాలబాలికలపై లైంగిన నేరాలకు పాల్పడినట్లు రుజువైతే పోక్సో చట్టం కింద యావజ్జీవ కారాగార శిక్ష అమలు అవుతుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్ తెలిపారు. మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలో మండల న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. యువత మొబైల్ ఫోన్లలో నీలి చిత్రాలు చూస్తూ పెడదోవ పడుతున్నారని తెలిపారు. పిల్లల చేతికి మొబైల్ ఇచ్చిన తర్వాత పిల్లలు ఎలాంటి వీడియోలు చూస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. పోక్సో చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతోనే న్యాయ సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ లక్ష్మణరావు, బార్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ గౌడ్, న్యాయవాదులు నాగరాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పందికోన రిజర్వాయర్‌పై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు

**బేతంచెర్ల:** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పందికోన రిజర్వాయర్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం మంచి పద్ధతి కాదని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి అన్నారు. సోమవారం బేతంచెర్లలో ఆయన మాట్లాడారు. పందికోన రిజర్వాయర్ ప్రాజెక్టు హంద్రీ–నీవా మొదటి పేజ్‌లో ఉందని.. ప్రాజెక్టు కింద సుమారు 61,400 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా 13 ఏళ్లు గడిచినా కేవలం 10 వేల ఎకరాలకు మించి సాగునీరు ఇవ్వడం లేదన్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నిర్మాణానికి రూ.250 కోట్లు కేటాయిస్తే వచ్చే ఖరీఫ్ సాగుకు సుమారు లక్ష ఎకరాల వరకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేసేలా మే 31వ తేదీ సిద్ధేశ్వరం వద్ద 2 లక్షల మంది రైతులతో శాంతియుతంగా నిరసన చేపడతామన్నారు. సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి, కోశాధికారి మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## జ్యోతి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

**బనగానపల్లె:** మండలంలోని నందవరం గ్రామంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరగనున్న చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలకు అధికారులందరూ సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మతో కలిసి అధికారులతో సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల కోసం రూ.12లక్షలతో కూలింగ్ వాటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ బీవీ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మధుసూదన్, ఏఈ సాయికృష్ణ పాల్గొన్నారు.

### ఈద్గాలో సకల సౌకర్యాలు



ఈద్గాలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

**డోన్:** రంజాన్ పర్వదినం సందర్భంగా స్థానిక ఈద్గా మైదానం శుభ్రత పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడ్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్ పరిశీలించారు. ఈద్గాకు నమాజ్ కోసం వచ్చే ముస్లింలకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. వారి వెంట కౌన్సిలర్లు సుంకయ్య, రైల్వే నాగేంద్ర, మున్సిపల్ ఏఈ సురేష్, ముస్లిం నాయకులు మాబు, ఫారెస్ట్ మౌలాలి ఉన్నారు.

### అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి

**బేతంచెర్ల:** ప్రజల సహకారంతోనే గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని గోరుమానుకొండ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులు, ఉపాధి హామీ పథకం పనులపై చర్చించారు. పీ–4 సర్వేకు గ్రామంలోని ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి కోరారు.



గోరుమానుకొండలో గ్రామ సభ

### 28న జాబ్‌మేళా

**డోన్ టౌన్:** స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న న్యాక్ కేంద్రంలో ఈ నెల 28వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్, న్యాక్ సెంటర్ ఇన్‌చార్జ్ పుల్లా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమితి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, అమెజాన్ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9573108032, 7981238237 నంబర్లను సంప్రదించాలన్నారు.

### ఏపీఓగా నిర్మలమ్మ

**కొలిమిగుండ్ల:** ఉపాధి హామీ పథకం ఏపీఓగా నిర్మలమ్మను ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ ఏపీఓగా పని చేస్తున్న గంగన్న ఆరు నెలల క్రితం బదిలీపై దొర్నిపాడుకు వెళ్లాడు. అప్పటి నుంచి ఏపీఓ పోస్టు ఖాళీగా ఉండేది. చాగలమర్రిలో విధులు నిర్వహిస్తున్న నిర్మలమ్మను కొలిమిగుండ్లకు నియమించారు. ఈసీగా పనిచేస్తున్న రాజబాబు బనగానపల్లె బదిలీ కాగా మరో ముగ్గురు టీఏలు వేర్వేరు ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. ఏపీఓగా నియమించిన నిర్మలమ్మ ఇక్కడ విధుల్లో చేరుతారా లేదా అనేది వేచిచూడాలి.

### ‘ఉపాధి’లో ఉద్యోగుల బదిలీలు

**కోవెలకుంట్ల:** మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా కోవెలకుంట్ల మండలంలో పని చేస్తున్న పలువురు సిబ్బందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. ఆ పథక ఏపీఓ శ్రీవిద్యను డోన్ నియోజకవర్గం ప్యాపిలి మండలానికి బదిలీ చేసి ఆ స్థానంలో నంద్యాల మండలంలో పనిచేస్తున్న శ్రీకళను నియమించారు. టెక్నికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న జయభారత్‌రెడ్డిని దొర్నిపాడుకు, పక్రుద్దీన్ బాషాను నంద్యాల మండలానికి బదిలీ చేశారు. ఆ స్థానాల్లో అవుకు, పాణ్యం మండలాల్లో పనిచేస్తున్న చాంద్ బాషా, నరసింహరాజును నియమించారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను సంజామలకు బదిలీ చేయగా ఆ స్థానంలో బనగానపల్లెలో పనిచేస్తున్న అబ్దుల్ రషీద్‌ను నియమించారు. వారంలోగా విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

### అవుకులో క్షుద్ర పూజల కలకలం



రోడ్డుపై పూజా సామగ్రి

**అవుకు:** మండల కేంద్రంలో క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపించడంతో సోమవారం కలకలం రేపింది. స్థానికుల తెలిపిన ప్రకారం.. అవుకు గ్రామంలోని సెంటర్–మార్కెట్ రోడ్డు నుంచి తెలుగుపేటకు వెళ్లే మార్గంలో పసుపు, కుంకుమ, ఆకులు, వక్కలు, నిమ్మకాయలు, పసుపుతో చేసిన బొమ్మ, నల్లటి పాత్రతో పూజలు చేసినట్లు కనిపించాయి. ఎవరో క్షుద్ర పూజలు చేశారని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అయితే అదేమీ క్షుద్ర పూజలు కాదని మరికొందరు వాదిస్తున్నారు. ఊరి నడిబొడ్డులో ఇలాంటివి జరగడం ఏంటని పలువురు చర్చించుకుంటున్నారు.

## ఆదిశంకరాచార్యుల విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

**డోన్ టౌన్:** మే 2వ తేదీ జరగనున్న జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని ఉత్సవ మూర్తి (విగ్రహం) కొనుగోలు కోసం అవసరమైన రూ.1.75 లక్షలను కళ్లె వంశస్తులు విరాళం ఇచ్చారు. సోమవారం శ్రీగాయత్రి పీఠం వ్యవస్థాపకుడు శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మను కలిసి నగదును అందజేశారు. కళ్లె చంద్రశేఖర్ శర్మ సోదరులు రూ.75 వేలు, కళ్లె భాస్కర్‌శర్మ రూ.50వేలు, శేషసాయిప్రసాద్ రూ.15వేలు, బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు శేషావలి శర్మ రూ.20వేలు, నరసరామయ్య రూ.15వేలు అందజేశారు.

### లారీల ఢీ.. డ్రైవర్ దుర్మరణం



మృతుడు ప్రసాద్

**బనగానపల్లి:** మండలంలోని పర్వతదేవరపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం పెద రాజుపల్లె గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రసాద్ (45) దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం తెల్లవారుజామున అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ పర్వతదేవరపల్లి వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా వేగాన్ని తగ్గించాడు. దీంతో వెనుకనే వస్తున్న లారీ డ్రైవర్ ప్రసాద్ వేగాన్ని నియంత్రించుకునే సమయం కూడా లేకపోవడంతో ముందున్న లారీని ఢీకొన్నాడు. క్యాబిన్ నుజ్జునుజ్జయింది. క్యాబిన్‌లోనే డ్రైవర్ ప్రసాద్ చిక్కుకున్నాడు. స్థానికులు అతి కష్టంపై అతన్ని వెలికి తీశారు. అప్పటికే తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. బనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రభుత్వాస్పత్రిలో సురక్షిత ప్రసవం



మాట్లాడుతున్న సీహెచ్‌సీ వైద్యురాలు సాగరిక

**బేతంచెర్ల:** ప్రభుత్వాస్పత్రుల్లో సురక్షిత కాన్పులు జరుగుతాయని శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్యురాలు సాగరిక అన్నారు. సోమవారం పట్టణంలోని సీహెచ్‌సీలో గర్భిణులకు ప్రసవాలపై అవగాహన కల్పించారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉండాలంటే ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పు చేసుకోవాలని సూచించారు. సిజేరియన్ కన్నా సాధారణ కాన్పు మంచిదన్నారు.

### మేలుజాతి దూడల ప్రదర్శన

**డోన్:** నేటి దూడలే రేపటి పాడి పశువులని పశుగణాభివృద్ధి జిల్లా ముఖ్య అధికారి డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో గోకుల్ మిషన్ పథకంలో భాగంగా సోమవారం మేలుజాతి దూడల ప్రదర్శన నిర్వహించారు. దూడల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నట్టల నివారణ కోసం కాల్షియం టానిక్, మినరల్ బాక్సులను పశు యజమానులకు ఉచితంగా అందజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ నాగరాజు, ప్రాంతీయ పశువైద్యుడు చంద్రమోహన్, హుసేన్‌బాషా, శిరీష పాల్గొన్నారు.



మేలుజాతి దూడల ప్రదర్శనలో అధికారులు

## ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**కొలిమిగుండ్ల:** స్థానిక దండోరా కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదేశాల మేరకు సీనియర్ నాయకుడు ఇరికిమాను నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వర్గీకరణ సంబరాలు చేసుకున్నారు. మందకృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. నాయకులు గూటం చిన్న కంబగిరి రాముడు, నాగన్న, మారెన్న, రామచంద్రుడు, బాల ఓబులేసు పాల్గొన్నారు.

## 26న డిగ్రీ కళాశాలలో వెబ్ సెమినార్

**బనగానపల్లె రూరల్:** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న డ్రగ్ రెసిస్టెన్స్ ఇన్ ట్యూబర్క్యులోసిస్ అనే అంశంపై అంతర్జాతీయ వెబ్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత తెలిపారు. సోమవారం కళాశాలలో అధ్యాపకులతో కలిసి వెబ్ సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. క్షయ వ్యాధి గురించి అవగాహన, క్షయవ్యాధిని కలిగించే బ్యాక్టీరియా దాని చికిత్సకు వినియోగించే ఔషధాలపై చర్చించడం జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. అధ్యాపకులు బాబునాథ్, సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### 27న బహిరంగ వేలం

**బనగానపల్లె:** ఈనెల 27వ తేదీ స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్లకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. దిన, వారపు సంత, వాహనాల స్టాండ్, జంతువధశాలతో పాటు పంచాయతీకి చెందిన 49 గదులకు బహిరంగ వేలం పాట ఉంటుందని వెల్లడించారు, ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు.

### చోరీ కేసు నమోదు

**కోవెలకుంట్ల:** మండలంలోని చిన్నకొప్పెర్లలో ఈ నెల 22వ తేదీ జరిగిన చోరీ సంఘటనపై ఆదివారం రాత్రి రేవనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి తాళం చెవిని ఇంటి గడపపైన పెట్టి మిరప కోత పనులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం తెరిచి బీరువాలో ఉన్న రూ. 1.70 లక్షల నగదు అపహరించుకెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన దస్తగిరి చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ టీం వివరాలు సేకరించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు.

### ఆస్పత్రి అభివృద్ధి పనులకు తీర్మాణం

**బేతంచెర్ల:** స్థానిక డ్రైవర్స్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్–3లో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సలహా సమావేశం నిర్వహించారు. వైద్యురాలు ప్రియాంక, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, చైర్మన్ కోట్ల మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు. సభ్యుల ఆమోదంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తీర్మాణం చేశారు. సబ్‌యూనిట్ మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు రాజమ్మ, నాగరాజమ్మ, రాధమ్మ, విష్ణు పాల్గొన్నారు.

### ఛావా సినిమా ఉచిత ప్రదర్శన

**డోన్ టౌన్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కించిన ఛావా సినిమాను మంగళవారం నుంచి మూడు రోజుల పాటు 4 షోలు ఉచితంగా ప్రదర్శించనున్నట్లు రాజా టాకీస్ యజమాని మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వరాజ్యం కోసం పోరాటం చేసిన మహనీయుల చరిత్ర అందరికీ తెలియాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### బార్ అసోసియేషన్ కోశాధికారి ఎన్నిక ఏకగ్రీవం



శ్రీనివాసులు

**డోన్ టౌన్:** డోన్ బార్ అసోసియేషన్ కోశాధికారిగా మంగమూరి శ్రీనివాసులు వరుసగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డోన్ కోర్టులో బార్ అసోషియేషన్ ఎన్నికకు ఈ నెల 21న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా కోశాధికారి పోస్టుకు శ్రీనివాసులు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవం అయ్యింది. పలువురు న్యాయవాదులు ఆయన అభినందనలు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల–లింగాల ఆర్అండ్‌బీ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని బిజనవేములకు చెందిన ప్రతాప్ బైక్‌పై సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చి తిరిగి ఇంటికి బయలు దేరాడు. మండలంలోని వెలగటూరు సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రున్ని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.